క్లుప్తంగా

చిన్నారులకు సమ్మర్ క్యాంప్

ఖమ్మంగాంధీచౌక్: చిన్నారులకు పలు అంశాలపై వేసవి శిక్షణ తరగతులు నిర్వహించేందుకు బాలభవన్ ఆధ్వర్యాన ఏర్పాట్లు చేసింది. వచ్చే నెల 1వ తేదీ నుంచి జూన్ 10వ తేదీ వరకు 40 రోజుల పాటు బాలబాలికలకు నిపుణులచే కూచుపూడి, గాత్ర సంగీతం, డ్రాయింగ్(చిత్ర లేఖనం), ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ప్రతీ రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ నిర్వహించనుండగా.. 5 నుంచి 15 ఏళ్ల మధ్య బాలలు మాత్రమే అర్హులని బాలభవన్ పర్యవేక్షకురాలు ఎస్.రాధ తెలిపారు. ఒక్కో అంశానికి రూ. 50ల చొప్పున రుసుముగా నిర్ణయించినట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు జిల్లా బాలభవన్(ఐఎంఏ హాల్ ఎదురుగా) మామిళ్లగూడెంలో సంప్రదించవచ్చన్నారు.మరిన్ని వివరాలకు 98669 34173, 73964 20185, 91600 30999, 83674 37244 లను సంప్రదించాలని సూచించారు.

బీఆర్ఎస్‌కు కార్పొరేటర్ రాజీనామా

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్‌కు ఆ పార్టీ 38వ డివిజన్ కార్పొరేటర్ ఆలియా, ఆమె భర్త మాజీ కార్పొరేటర్ మొహమ్మద్ షౌకత్ అలీలు ఆదివారం రాజీనామా చేశారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు రాసిన లేఖను జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్‌కు పంపించారు. పార్టీలో తమకు సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

సీపీఐ సీనియర్ నాయకుడి మృతి

కూసుమంచి: మండలంలోని గైగోళ్లపల్లి గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ సర్పంచ్ సంగబత్తుల వెంకటరెడ్డి (98) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఈమేరకు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సంతాపం వ్యక్తం చేయగా.. పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు, జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు దండి సురేష్, మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్‌రెడ్డి, రామాంజనేయులు, శ్రీనివాసరావు, మల్లేష్‌తో పాటు మండల కార్యదర్శి భూక్యా నర్సింహా తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

సంతాపం..

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ మాదిగ హక్కుల దండోర రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడిశాల వెంకన్న అల్లుడు కంపాటి వినోద్ మృతికి మాదిగ హక్కుల దండోర రాష్ట్ర అధ్యక్షుడు కొరిపల్లి శ్రీనివాస్ సంతాపం తెలిపారు. ఆదివారం ఖమ్మంలోని ఆయన నివాసంలోమృతదేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దుపెల్లి శ్రీను, సురేష్, మందకుమార్, కొండా వెంకన్న, చెరుకుపల్లి చిన్న భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి..

తిరుమలాయపాలెం: మండలంలోని రమణాతండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రామావత్ కస్నానాయక్ ఇటీవల మృతి చెందాడు. ఈమేరకు ఆదివారం బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేష్‌రెడ్డి కస్నానాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చందావత్ రాజు, రఘు, వీరన్న, సైదా తదితరులు పాల్గొన్నారు.

కొక్కిరేణి మాజీ సర్పంచ్‌కు..

తిరుమలాయపాలెం: మండలంలోని కొక్కిరేణి మాజీ సర్పంచ్ గుగ్గిళ్ల రాములమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. ఈమేరకుమద్దులపల్లి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బత్తుల రవికుమార్, కో ఆప్షన్ సభ్యుడు సైపుద్దీన్, కొక్కిరేణి, తాళ్లచెరువు, మద్దులపల్లి ఎంపీటీసీలు గుగ్గిళ్ల అంబేద్కర్, చుంచు వెంకటేశ్వర్లు, గొడ్డుగోర్ల వెంకటేశ్వర్లు, మాజీ ఉపసర్పంచ్ సిరిగడ్డె ఉపేందర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చావా వెంకటేశ్వరరావు, కర్నాటి రాజేంద్రప్రసాద్ తదితరులు రాములమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	30	బచ్చలికూర	5
వంకాయ	20		20
బెండకాయ	26	పాలకూర	2
పచ్చిమిర్చి	44		10
కాకర	50	చుక్కకూర	2
బీర	46		10
దొండ	30	తోటకూర	2
పొట్లకాయ	40		10
చిక్కుడు	80	గోంగూర	2
గోరుచిక్కుడు	36		10
క్యాబేజీ	24	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	30		20
ఆలుగడ్డ	36	కొత్తిమీర	1
చామగడ్డ	40		30
క్యారెట్	40	పుదీన	1
క్యాప్సికం	60		20

-ఖమ్మం వ్యవసాయం

ఆశయం.. ఆలస్యం!



నిలిచిపోయిన ఆర్‌యూబీ నిర్మాణ పనులు

ఆర్‌యూబీ నిర్మాణంలో రైల్వే శాఖ జాగు

- మున్సిపల్ శాఖ పనులు చేస్తున్నా సహకరించని రైల్వే శాఖ
- టెక్నీషియన్ల ఏర్పాటులో నిర్లక్ష్యం
- ఇప్పటి వరకు రూ.2కోట్లకు పైగా ఖర్చు
- పట్టాలు దాటే తిప్పలు తప్పేదెన్నడో?

ఖమ్మంరాపర్తినగర్: దేవుడు వరమిచ్చినా.. పూజారి కనుకరించని చందంగా మారింది మామిళ్లగూడెం- సారథినగర్ రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం పనులు. సుదీర్ఘకాలంగా ఆర్‌యూబీ నిర్మాణం ఏర్పాటుకు ఎంతో మంది చేసిన పోరాటం వృథా అవుతోంది. అండర్ బ్రిడ్జి నిర్మించాలని ఆశయం బాగున్నా.. రైల్వేశాఖ సహకరించడంలో ఆలస్యం చేస్తోంది. 2012లో దీని నిర్మాణ పనులు చేపట్టగా.. ఇప్పటి వరకు అవాంతరాలు ఎదురవుతూనే ఉన్నాయి. ఇటీవల కాలంలో మరోసారి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు దాదాపు రూ.15 లక్షల నిధులతో గతంలో వివాదాస్పదంగా ఉన్న ఖాళీ స్థలం నుంచి నేరుగా మామిళ్లగూడెం టు సారథినగర్ వెళ్లేందుకు ఆర్‌యూబీ నిర్మాణ పనులను చేపట్టింది. కాగా, రైల్వే శాఖకు ఆ ప్రాంతంలో ఉన్న ఎలక్ట్రికల్ వైర్లు అడ్డు రావడంతో మున్సిపాల్ శాఖ ఇటీవల ఒక లేఖను రాసింది. ఇక్కడ నిర్మాణం పనులు జరుగుతున్నప్పుడు ఒక టెక్నీషియన్‌ను ఏర్పాటు చేయాలని వెంటనే తమ పనులను పూర్తి చేస్తామని రాశారు. కానీ రేఖ రాసి 20 రోజులు దాటిన రైల్వే శాఖలో కదలిక లేకపోవడంతో మున్సిపాల్ శాఖ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఖమ్మం రైల్వే శాఖపై ఫిర్యాదు చేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యాన 20 రోజుల క్రితం వరకూ మున్సిపల్ శాఖ పనుల చేపట్టడంతో అక్కడి ప్రాంతవాసులు ప్రశంసించగా.. రైల్వే శాఖ అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

దశాబ్ద కాలంగా నిర్లక్ష్యం..

దశాబ్ద కాలంగా ఆర్‌యూబీ నిర్మాణంపై గల నిర్లక్ష్యానికి అంతర్యమేమిటని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మామిళ్లగూడెంలోని డ్రెయినేజీలను కొత్తగా నిర్మించారు. టెక్నికల్ పనులకు సంబంధించిన కొద్ది పనులు పూర్తయితే రాకపోకలను సాగించవచ్చనే ఆ ప్రాంతావాసులు భావిస్తున్నారు. గతంలో బ్రిడ్జి నిర్మాణం పూర్తయినా వర్షం వస్తే బ్రిడ్జి పూర్తిగా మునిగిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడేది. కొన్నేళ్లుగా బ్రిడ్జి నిర్మాణం అలంకారప్రాయంగా నిలిచిందనే ఆరోపణలు ఉన్నాయి. అక్కడి ప్రజలు మాత్రం ఇప్పటికి పట్టాలు దాటే పాత పద్ధతినే పాటిస్తున్నారు. ఇదంత ప్రజాప్రతినిధులకు పట్టడంలేదని ఆ ప్రాంతవాసులు దుయ్యబడుతున్నారు.

ఎదురుచూపులు ఇంకెన్నేళ్లో..?

ఆర్‌యూబీ పూర్తయితే మామిళ్లగూడెం- సారథినగర్ వెళ్లేందుకు సులువుగా వెళ్లొచ్చు. అంతేకాక సారథినగర్ నుంచి గాంధీచౌక్, కాల్వొడ్డు జూబ్లీక్లబ్ ప్రాంతాలకు వెళ్లేందుకు తక్కువ దూరం ఉంటుంది. ఈ ప్రాంతాల నుంచి నిత్యం విద్యాలయాలకు వెళ్తున్న విద్యార్థులు ఇప్పటికీ పట్టాలు దాటి వెళ్లాల్సి వస్తోంది. తమ కష్టాలకు ఖమ్మం మున్సిపాల్ కార్పొరేషన్ చెక్ పెడుతుందని అభిప్రాయపడ్డారు. కాని రైల్వే శాఖ నిర్లక్ష్యం కారణంగా ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న బ్రిడ్జి నిర్మాణం పనులు సత్వరం పూర్తి చేసి వెంటనే పనులు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కార్పొరేట్ వ్యతిరేక దినోత్సవంగా మేడే



సమావేశంలో మాట్లాడుతున్న పోటు ప్రసాద్

ఖమ్మంమయూరిసెంటర్: కార్పొరేట్ రంగం విస్తరించి కార్మిక హక్కులను రోజురోజుకు హరిస్తున్న వేళ కార్మిక దినోత్సవ మేడేను కార్పొరేట్ వ్యతిరేక దినోత్సవంగా జరుపుకోవాలని ఏఐటీయూసీ జాతీయ సమితి సభ్యుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం మేడే జయప్రదం చేయాలని కోరుతూ సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ పదేళ్ల కాలంలో అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న హక్కులు హరించబడ్డాయని, శ్రమ దోపిడీ పెరిగిందని, ఉద్యోగ భద్రత కరువైందని తెలిపారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతన సవరణ చేయాలన్న కార్మిక సంఘాల డిమాండ్‌ను మోదీ ప్రభుత్వం పట్టించుకునే స్థితిలో లేదన్నారు. కార్పొరేట్‌కు ఊడిగం చేయడమే మోదీ ప్రభుత్వ లక్ష్యంగా మారిందని ఆరోపించారు. మరోసారి ఈ దేశంలో బలమైన కార్మికోద్యమ నిర్మాణం జరగాలని, అందుకు మేడే నాంది పలకాలని అన్నారు. వాడవాడలా మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పిండిప్రోలులో అ'పూర్వ' సమ్మేళనం



డీజే బాక్సులు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు పాఠశాలలో పదో తరగతికి(2004-05 బ్యాచ్) చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలలో స్థిరపడిన స్నేహితులంతా ఒక చోట కలుసుకుని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈనేపథ్యాన పాఠశాలకు రూ.36 వేల విలువైన డీజే సౌండ్ బాక్సులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీసుజాతకు వితరణగా అందజేశారు. పాఠశాలలో విద్యార్థుల విద్యాభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

ప్రజా సేవ చేయడమే లక్ష్యం..

ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి



ఖమ్మంఅర్బన్: రఘురాంరెడ్డిని సత్కరిస్తున్న సీపీఎం నాయకులు

ఖమ్మంఅర్బన్: ప్రజా సేవ చేయడమే తన లక్ష్యమని, ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని 14వ డివిజన్‌లో గొల్లగూడెం ఈద్గా మైదానంలో వాకర్లతో కలిసి నడిచిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ.. ముచ్చటించారు. హస్తం గుర్తుకే ఓటు వేసి అభివృద్ధికి బాటలు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, నగర పార్టీ అధ్యక్షుడు ఎండీ జావీద్, నాయకులు తోట ప్రసాద్, కమతం రామకృష్ణ, బడేసాహేబ్, బండి వెంకన్న తదితరులు ఉన్నారు.

రఘురాంరెడ్డికి సన్మానం..

ఖమ్మంమయూరిసెంటర్: ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న సీపీఎం ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి విజయానికి కృషి చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం సీపీఎం జిల్లా కార్యాలయం సుందరయ్య భవనానికి రఘురాంరెడ్డి వెళ్లగా.. సీపీఎం నాయకులు సాదరంగా స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం రఘురాంరెడ్డి మాట్లాడుతూ.. ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న సీపీఎం తనకు మద్దతుగా నిలవాలని జిల్లా నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బాలసాని లక్ష్మీనారాయణ, తుమ్మల యుగందర్, జావీద్, మిక్కిలినేని నరేంద్ర, చావా నారాయణరావు, సైదాబాబు, బేబీ స్వర్ణకుమారి, సీపీఎం నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్, మాచర్ల భారతి, వై.విక్రమ్, భూక్యా వీరభద్రం, కల్యాణం వెంకటేశ్వరరావు, మాదినేని రమేష్, బండారు రమేష్, ఆర్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక..

నేలకొండపల్లి: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనేపథ్యాన వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువా కప్పి సాధారంగా ఆహ్వానించారు. ఈ సమావేశంలో డివిజన్ నాయకులు శాఖమూరి రమేష్, కొర్లకుంట్ల నాగేశ్వరరావు, సీతారాములు, భద్రయ్య, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, మండల నాయకులు బోయిన వేణు, కడియాల నరేష్, డి.రాధాకృష్ణమూర్తి, హనుమంతరావు, ముత్తినేని వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



నాచేపల్లిలో పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రసాద్‌రెడ్డి

బీజేపీ శ్రేణుల ప్రచార హోరు..



తిరుమలాయపాలెం: రోడ్ షోలో మాట్లాడుతున్న పొంగులేటి సుధాకర్‌రెడ్డి

తిరుమలాయపాలెం/ఖమ్మంమామిళ్లగూడెం/నేలకొండపల్లి: ఖమ్మం బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు గెలుపును కాంక్షిస్తూ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృత ప్రచారం చేశారు. ఈమేరకు ఆదివారం తిరుమలాయపాలెంలో ఎంపీ అభ్యర్థి వినోద్‌రావుతో కలిసి బీజేపీ జాతీయ నాయకుడు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల కోఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి రోడ్ షో నిర్వహించారు. అలాగే ఖమ్మంలోని 37వ డివిజన్‌లో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మార్తి వీరభద్రప్రసాద్ ఆధ్వర్యాన, 57వ డివిజన్ రమణగుట్ట, వికలాంగుల కాలనీలలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రగాని మాధవ్ ఆధ్వర్యాన, నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరులో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పాగర్తి సుధాకర్ ఆధ్వర్యాన ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేపట్టారు. తిరుమలాయపాలెం రోడ్ షోలో సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఖమ్మం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావును అత్యధిక మెజారిటీతో గెలిపించినట్లయితే ఖమ్మం జిల్లాను మరింత అభివృద్ధి చేసుకొని ప్రతీ ఒక్కరికి కేంద్ర ప్రభుత్వ పథకాలు నేరుగా అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ దేశంలో కాలం చెల్లిన కమ్యూనిస్టులకు, అస్తిత్వం కోల్పోతున్న కాంగ్రెస్ పార్టీకి, అప్పుల ఊబిలోకి నెట్టిన బీఆర్ఎస్ పార్టీకి బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. ఈనేపథ్యాన బీజేపీకి మద్దతు తెలిపిన ఎమ్మార్పీఎస్ నాయకుడు శ్రీ మంద కృష్ణ మాదిగకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా రవికుమార్, జిల్లా నాయకుడు తక్కెళ్లపల్లి నరేందర్‌రావు, అసెంబ్లీ కన్వీనర్ మేక సంతోష్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డుపల్లి ప్రసాద్, నాయకులు పోలిశెట్టి పద్మావతి, సోడే ధర్మేందర్, కట్టా శివ, కుంచపర్తి ప్రవీణ్, భద్రం, యుగందర్ నాయుడు, కమర్లపుడి ఉపేందర్, పిట్టల సూరిబాబు, రామావత్, దేవాల, మూడు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దుష్ప్రచారాలను తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న గుమ్మడి అనురాధ

ఖమ్మంరూరల్: సామాజిక మాధ్యమాల్లో మహిళలపై జరుగుతున్న దుష్ప్రచారాలను విద్యార్థులు తిప్పికొట్టాలని ప్రొఫెసర్ గుమ్మడి అనురాధ అన్నారు. ఆదివారం మండలంలోని ప్రియదర్శిని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో పీడీఎస్ ఆధ్వర్యాన సామాజిక మాధ్యమంలో మహిళలపై దాడులు-విద్యార్థుల పాత్ర అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళా సాధికారత కోసం కృషి చేయాల్సిన పాలకులు మహిళలపై దుష్ప్రచారం చేస్తున్నా ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. నేడు ప్రజాస్వామిక వాదులు, మహిళా జర్నలిస్టులు, తదితర మహిళలపై దాడులు చేస్తున్న ఆకతాయిలపై చర్యలు తీసుకునే పరిస్థితి లేదని విమర్శించారు. ఈ నేపథ్యాన విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని, తమపై జరుగుతున్న దాడులకు ధీటుగా సమాధానమివ్వాలని సూచించారు. ఈ సదస్సుల్లో పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.వెంకటేష్, పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు ప్రతాపనేని శోభ, నర్సయ్య, పరమేశ్వర్ హిర్వేల్, పృథ్వి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని 33/11 కేవీ ప్రభుత్వ ఆస్పత్రి సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న 11 కేవీ నెహ్రూనగర్ ఫీడర్‌లో మరమ్మతు పనుల కారణంగా సోమవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-5 ఆపరేషన్స్ ఏఈ ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో వైరారోడ్ కిమ్స్ ఆస్పత్రి ప్రాంతం, బీకే బజార్, నిజాంపేట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

జిల్లా దళిత మోర్చా ఉపాధ్యక్షుడిగా శ్రీను

రఘునాథపాలెం: జిల్లా దళిత మోర్చా ఉపాధ్యక్షుడిగా మండలంలోని వీవీపాలెంకు చెందిన మాజీ ఎంపీటీసీ తగరం శ్రీనివాస్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు కోటమర్తి సుదర్శన్ ఆదివారం నియామపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యత ఇచ్చినందుకు రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు విజయం కోసం కృషి చేస్తానన్నాడు.

నర్సంపేట అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా ముస్తఫా

ఖమ్మంవన్‌టౌన్: వరంగల్ పార్లమెంట్ పరిధిలోని నర్సంపేట అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా ఖమ్మం నగరానికి చెందిన మహ్మద్ ముస్తఫాను నియమిస్తూ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ముస్తఫా మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వహించి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ ఎంపీగా కడియం కావ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తానన్నారు.

ఎన్ఎస్‌యూఐ సమావేశాన్ని విజయవంతం చేయాలి

ఖమ్మంవన్‌టౌన్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నిర్వహిస్తున్న ఎన్ఎస్‌యూఐ సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్లపల్లి సంతోష్ ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సాయంత్రం 4 గంటలకు ఎస్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఎన్ఎస్‌యూఐ శ్రేణులకు పార్లమెంట్ ఎన్నికలపై అనుసరించాల్సిన వ్యూహాలపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌లు దిశానిర్దేశం చేస్తారన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు, ఖమ్మం ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి తదితరులు పాల్గొంటారని తెలిపారు.

తాజ్ మహల్ సమ్మర్ స్పెషల్ ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న దయాకర్‌రెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని ముస్తఫానగర్ ఆధూరి గోపిరెడ్డి మైదానంలో భారీ సెట్టింగ్‌లతో ఏర్పాటు చేసిన తాజ్‌మహల్ సమ్మర్ స్పెషల్ ఎగ్జిబిషన్‌ను డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, తుంబూరు దయాకర్‌రెడ్డిలు ఆదివారం ప్రారంభించారు. అన్ని వర్గాల వారిని ఆకర్షించేలా స్టాళ్లు, చిన్నారుల కోసం ప్రత్యేక ఆట వస్తువులను ఏర్పాటు చేయగా, ప్రతీ రోజు సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్వహించబడుతుందని నిర్వాహకులు తుమ్మ అప్పిరెడ్డి, బాల శౌరి, వాసు, మహేష్, అచ్చయ్యలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కమర్తపు మురళి, మేడరపు వెంకటేశ్వర్లు, మండదపు మనోహర్, మండదపు బ్రహ్మ రెడ్డి, సాదు రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

రైల్వేలైన్‌కు వ్యతిరేకంగా సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న రైతులు

ఖమ్మంరూరల్: డోర్నకల్ నుంచి వెళ్లే రైల్వేలైన్ కోసం చేస్తున్న సర్వేను తక్షణమే ఆపాలని కోరుతూ మండలంలోని ఆరెకోడులో రైతులు ఆదివారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. రైల్వేలైన్ కోసం తమ విలువైన వ్యవసాయ భూములను ఇవ్వలేమని, తమకు ఈ భూములే ఆధారమని, దీన్ని కూడా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సర్వేను ఆపాలని, లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు.

అటెన్షన్ ప్లీజ్

తాగునీటి తంటాలు..!



బొడ్రాయి సెంటర్ వద్ద మూసివేసిన వాటర్ ప్లాంట్

కామేపల్లి మండలం కొమ్మినేపల్లి గ్రామ పంచాయతీకి రూ.కోట్ల ఆదాయం ఉన్నా.. గ్రామంలో సమస్యలు మాత్రం తీరడం లేదు. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులు చెప్పున్నా..గ్రామ స్థాయిలో మాత్రం అధికారులు అలసత్వం వహిస్తునే ఉన్నారు. కొమ్మినేపల్లి జీపీ ఆధ్వర్యాన కొనసాగుతున్న వాటర్ ప్లాంట్లు మరమ్మతులకు గురి కావడంతో స్థానికులు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. నెల రోజుల క్రితం బొడ్రాయి సెంటర్‌లోని వాటర్ ప్లాంట్, పది రోజుల క్రితం గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపంలోని వాటర్ ప్లాంట్లు మరమ్మతులకు గురైనా నేటికీ రిపేరు చేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

- కామేపల్లి